# దీపం చెప్పిన కతలు

గోపిని కరుణాకర్

# కొండెక్కిన దీపం!

మొగలి గోడమింద వాలిన నెమలిపుంజు రెపరెపమని రెక్కలు కొట్టుకోని,

''కొక్కరకోకో... కొక్కర కోకో'' అని కూసింది.

పల్లె ఉలిక్కిపడింది.

గోపినింటి దీపం రెపరెపమని తలాడించింది.

పైకిలేసి బుజాల మిందనుంచి దుప్పటి జారవిడిచి వొళ్ళు విరుచుకున్నాడు అనుమంతునాయుడు.

''ఏంబా... ఎట్లుండాది ఇప్పుడు?'' అని అడిగింది చిన్నవ్వ.

''మల్లా జన్మెత్తినట్టుండాది. వేడివేడిగా నీళ్ళు పోసుకుంటే వొళ్ళు నొప్పులన్నీ పోతాయి'' అన్నేడు అనుమంతునాయుడు.

కిరసనాయిలు బుడ్డీని ముట్టించి,

''పెదబ్బ... పెద్దింట్లో దీపాన్ని కొండెక్కించు'' అని చెప్పింది చిన్నవ్వ.

''నూనె అయిపొయ్యేదాకా మండనీలే'' అన్నేడు పెదబ్బ.

''నూనె అయిపొయ్యేదాకా వుండగూడదు. ప్రమిద ఆరిపోతే దీపం చచ్చిపోతుంది. నూనె వుండగానే కొండెక్కించాలి'' అనింది చిన్నవ్వ.

''కొండెక్కిస్తే దీపం ఎక్కడికి పోతిందివా?'' అన్నేడు పెదబ్బ.

''దేవలోకానికి పోతింది'' అని చెప్పింది చిన్నవ్వ.

''దేవలోకానికా...?'' అని ఇచ్చిత్తరపొయినాడు పెదబ్బ.

''పడుకొనేటప్పుడు దీపాలని కొండెక్కిస్తాం గదా! ముందుపొయిన దీపం, ఎనక పొయిన దీపం మూలస్తానమ్మ గుడికాడికి పొయ్యి హాజరవతాయి. అన్ని దీపాలు కలుసుకోని, దేవలోకానికి యలబారిపోతాయి'' అని చెప్పింది చిన్నవ్వ.

''అయితే.. మల్లా?'' అన్నేడు పెదబ్బ చెప్పే కతని పొడిగించమన్నట్టు.

చిన్నవ్వ పైకిలేవబోయింది. తొడ మింద తలపెట్టుకోని నిద్రపోతావున్నేడు పెదబ్బ.

''పెదబ్బా... లెయ్యి తెల్లారిపొయింది'' అనింది చిన్నవ్వ.


ఉలిక్కిపడి లేసి దిక్కులు చూసినాడు పెదబ్బ.

''రాత్తిరంతా మేల్కొంటానని ఎచ్చులు చెప్పిన పుడింగివి గదా! నువ్వు'' అని నవ్వింది చిన్నవ్వ.

చిన్నవ్వతోపాటు మేల్కోనుండే పెద్దత్త, బూబత్త వాళ్ళు గూడా నవ్వినారు.

కాసీమ్ మామ, బూబత్త సాయిబులపల్లెకి యలబారిపొయినారు. గొర్రెలతాత మడికాడికి పొయినాడు. పెద్దత్త వాళ్ళింటికి పొయింది.

చిన్నవ్వ లేసి పొయ్యి ముట్టించి, నీళ్ళ కాగు పొయ్యిమింద పెట్టింది.



''మల్లాలేదు. గిల్లాలేదు. కతలు చెప్పుకొనే తీరి కెక్కడిది? నేను చెత్తులు వూడ్చాలి'' అనింది పరకనీ, చేటనీ తీసుకుంటా చిన్నవ్వ.

ఆ మాటతో పెదబ్బ పొయ్యి దీపాన్ని కొండె క్కించినాడు.

కొండెక్కించగానే,

ఆ దీపం ఎక్కడలేని ఆనందంతో గబగబా మూలస్తానమ్మ గుడికాడికి నడిచింది. ఆ దీపం వెంటే పెదబ్బ గూడా నడిచినాడు.

ముందు దీపం,

వెనక పెదబ్బ నడస్తా వుండారు.

***

వేపచెట్టుమింద వాలిన అచ్చులు, పచ్చులు మేల్కోని గంగనాగోలగా అరస్తా వుండాయి.

''పచ్చులు లేసేసినాయి. మనుషులు గూడా లేస్తారు. లెయ్యండి... లెయ్యండి'' అని తొందరపె ట్టింది నగిరింటి దీపం.

దీపాలన్నీ పైకి లేసినాయి. వాటి వెలుగు నీడలు కూడా పైకి లేచినాయి.

''వుండండి.. వుండండి. ఒక్క నిముషం'' అనింది పెద్దింటి దీపం.

ఏమిటన్నట్టు చూసినాయి దీపాలు.

''మనం ఎన్నో మంచిమంచి కతలు చెప్పు కున్నాం గదా! వాటిని మన వెంటే పట్టుకుపోతే ఏం బాగుంటుంది? వాటిని లోకానికి అందిస్తే ప్రజల నోళ్ళల్లో నానుతూ కలకాలం జీవిస్తాయి'' అనింది పెద్దింటి దీపం.

''నువ్వు చెప్పింది నిజమే! మరయితే లోకానికి ఎట్లా అందించేది?'' అని అడిగింది బృందావన దీపం.

''చెప్తానుండు'' అని చెప్పి కాలికున్న వెండి గొలుసు విప్పుకోని పట్టీకి ఘల్లుఘల్లుమంటున్న గజ్జెల్ని లాగేసింది.

''నేను ఎన్ని కతలు చెప్పినాను?'' అని ఆలో చించుకోని,

''ఒకటి... రెండు... మూడు... ఆ ఏడు కతలు. నేను ఏడు గజ్జెలు ఈ పట్టీకి కూరుస్తాను. అట్లనే మీరు గూడా ఎన్నెన్ని కతలు చెప్పినారో అన్నెన్ని గజ్జెల్ని మీ కాలి పట్టీలో నుంచి తీసి కూర్చండి. ఈ పట్టీని ఇక్కడ్నే జారవిడిచి దేవలోకానికి వెళ్ళి పోదాం. ఇటుపక్కకి వచ్చిన వాళ్ళెవరన్నా ఈ పట్టీని తీసుకుంటారు. చేత్తో పట్టుకుని కుదిలిస్తే ఒక్కొక్క గజ్జె ఒక్కొక్క కతని వినిపిస్తుంది'' అని చెప్పి తను చెప్పిన ఏడు కతలకి ఆనవాలుగా ఏడు గజ్జెల్ని కూర్చింది పెద్దింటి దీపం.

ఆ పట్టీన్ని తీసుకుని మిగతా దీపాలు కూడా కతలు చెప్పినందుకు ఆనవాలుగా గజ్జెల్ని కూర్చి నాయి.

పెద్దింటి దీపం తీసుకోని లెక్కపెట్టి ''ఇరవై ఆరు కతలు చెప్పుకున్నాం'' అనింది.

ఇంతలో

గెసపోస్తా గోపినింటి దీపం పరిగెత్తుకుంటా వచ్చింది.

''ఏమమ్మా... ఇప్పుడొచ్చినావు?'' అని అడి గింది చిలకముక్కు దీపం.

''ఏం చెయ్యమంటావు? మా ఇంట్లో అనుమం తునాయుడికి పాము కరిసింది. పాము కరిస్తే కంటి మింద రెప్పెయ్యగూడదు గదా! కోడి కూసేంతవ రకు నన్ను కొండెక్కించలేదు'' అని గెసపోస్తా చెప్పింది గోపినింటి దీపం.

దీపం వెంట వచ్చిన పెదబ్బ వేపచెట్టు మరు గున దాక్కున్నాడు.

నింగిలోని చుక్కలు నేలకు దిగినట్టు మిణుకు మిణుకుమంటా దీపాలు మనుషుల్లాగా మాట్లా డుతూ, తిరుగుతుంటే పెదబ్బకి ఇచ్చిత్తరంగా వుండాది.

గుడ్లు మిటకరించుకోని చూస్తా వుండాడు.

''నీకోసమేనమ్మా ఇంతసేపు ఎదురు చూస్తా కూర్చున్నాం. తెల్లవారిపోతున్నా నువ్వు రాక పొయ్యేసరికి నీమింద ఆశ వదులుకున్నాం'' అని చెప్పింది పెద్దింటి దీపం చేతిలోని పట్టీని కుది లిస్తూ.

అలా కుదిలించేసరికి కతలు ఘల్లుఘల్లున విని పించినాయి.

గోపినింటి దీపం ఇచ్చిత్తరపోతా.

''ఇదేంది ఇది. కాలిపట్టీ ఘల్లుఘల్లున మోగ కుండా, ఘల్లు ఘల్లున కతలు వినిపిస్తున్నాయి?'' అని అడిగింది.

''నీకోసం ఎదురుచూస్తా రాత్తిరంతా మేము చెప్పుకున్న కతలు'' అని చెప్పింది పెద్దింటిదీపం.

ఆ పట్టీని గుడిమెట్ల మింద పడేసి దీపాలు దేవ లోకానికి యలబారినాయి.

చుక్కల పర్వతం ఎక్కి కనుమరుగయ్యేంతవ రకు దీపాలనే చూస్తా వుండిపోయినాడు పెదబ్బ.

దీపాలట్టా కనుమరుగవతానే పరిగెత్తుకుంటా పొయ్యి మెట్లమింద పడున్న పట్టీని తీసుకున్నేడు.

చెవులకాడ పెట్టుకోని కుదిలించినాడు.

ఘల్లుఘల్లున మోగుతూ,

ఒక్కొక్క గజ్జె ఒక్కొక్క కతని వినిపిస్తోంది.

★

## అంకితం

ఈ కతలన్నీ మాయమ్మకు (గోపిని కళ్యాణమ్మ),
మా నాయనకు (గోపిని హనుమంతునాయుడు),
ఈ కతలన్నీ నన్ను ఎంతో ముదిగారంగా పెంచి, పెద్దచేసి,
విద్యాబుద్ధులు చెప్పించిన మా ఇడ్లీ అవ్వకు
(అమ్మమ్మ కేసు ఈశ్వరమ్మ),
మా అంగిడి తాతకు (కేసు లక్ష్మయ్య),
ఈ కతలన్నీ నా చేత అ,ఆలు దిద్దించిన
సుబ్బారెడ్డి అయివోరికి,
కతలు దిద్దించిన పులికంటి కృష్ణారెడ్డి గారికి,
సినిమాలు దిద్దించిన వంశీ గారికి,
ఈ కతలన్నీ నాకు ఎంతో ఇష్టమైన
నెమలి దేవుడికి (సుబ్రమణ్యస్వామి)
ఎంతో భక్తితో,
ఎంతో ఇష్టంగా అంకితం ఇస్తున్నాను.

## కృతజ్ఞతలు

సాయంత్రంపూట లైట్లు వెలగగానే నాగార్జున సర్కిల్ దగ్గరుండే విల్స్ లైఫ్‌స్ట యిల్ మెట్లమీద కుర్చోని గ్లోబలైజేషన్ అవు తున్న నగరాన్ని చూడడమంటే నాకు ఎంతో ఇష్టం.

కవులు, రచయితలు గ్లోబలైజేషన్ని వ్యతి రేకిస్తారు గాని నాకైతే గ్లోబలైజేషన్ అంటే చాలా ఇష్టం. పల్లెనుంచి వచ్చిన నాకు అదంటే వ్యామోహం కూడా.

అది ఎప్పుడూ నన్ను కవ్విస్తూ ఎండమా విలా అంది అందకుండా, పొంది పొంద కుండా ఆటపట్టిస్తూనే వుంటుంది.

ఆ ఆటలే వారం, వారం నవ్యలో దీపాల కతలు చెప్పుకోవటం మొదలెట్టినాయి.

మనమంతా గ్లోబలైజ్ అయిపొయి నాము.

ఇప్పుడా! తెల్లోడు మన నేలమింద అడు గుపెట్టినప్పుడే గ్లోబలైజ్ అయిపొయినాము.

మన కతలు, కవిత్వం గూడా గ్లోబలైజ్ అయిపొయింది. అప్పుడు రష్యనైజ్ అయింది. ఇప్పుడు అమెరికనైజ్ అయింది. మనల్ని పాలించేవాళ్ళు, మనము, దాన్నే తాగుతు న్నాము, తింటున్నాము, నిద్రపోతున్నాము.

ఇలాంటి సందర్భంలో నేను రాసిన ఈ కతలు రష్యనైజ్, అమెరికనైజ్, గ్లోబలైజ్ కాని అచ్చమైన తెలుగు కతలు.

ఈ కతల్ని నాయిష్టంగా నన్ను రాసుకోవ డానికి స్వేచ్ఛనిచ్చిన నవ్యకి, మనసారా చదివి దీవెనలిచ్చిన పాఠకులకు మక్కువగా నమస్కారాలు చెప్పుకుంటున్నాను.

– గోపిని కరుణాకర్.